## క్లుప్తంగా

### షిల్ట్ పనులు పరిశీలన



**తెనాలిఅర్బన్:** చిట్టి ఆంజనేయస్వామి గుడి వద్ద జరుగుతున్న షిల్ట్ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ ఆదివారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలలో రెండు సార్లు పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

### దుప్పట్లు పంపిణీ



**తెనాలిటౌన్:** పట్టణ బుర్రిపాలెం రోడ్డులోని యేసయ్య ప్రార్థనా మందిరంలో ఆదివారం పేదలకు దుప్పట్లను రత్నం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పంపిణీ చేశారు. ప్రార్థనా మందిరంలో సంఘ పాస్టర్ గెద్దం ఎలీషా వాక్యపరిచర్య చేశారు. ట్రస్ట్ ప్రెసిడెంట్ దేవరపల్లి టైటస్ సుమారు 30 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రసాదకుమారి, సంఘస్థులు పాల్గొన్నారు.

### రేపు జేఎంజే కళాశాలలో మెగా జాబ్‌మేళా

**తెనాలిఅర్బన్:** జేఎంజే కళాశాల ఆధ్వర్యంలో ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో మంగళవారం ఉదయం మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ తెలిపారు. కళాశాల ఆవరణలో ఉదయం 9.30 గంటలకు మేళా ప్రారంభమవుతుందన్నారు. బీఎస్సీ, బీసీఏ, బీకాం, బీబీఏ, ఇంటర్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులందరూ దీనిలో పాల్గొనవచ్చని చెప్పారు. ఆధార్‌కార్డు, పాసుపోర్ట్ ఫొటోలు, సర్టిఫికెట్స్‌తో హాజరు కావాలని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ ఉపయోగించుకోవాలని కోరారు.

### 26, 27 తేదీల్లో క్రీస్తు రాకడ సందేశ సభలు

**తెనాలిఅర్బన్:** లార్డ్స్ ఫుల్ గాస్పల్ షాలేమ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఈ నెల 26, 27 తేదీల్లో క్రీస్తు రాకడ సందేశ సభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పాస్టర్ పి.జాన్‌వెస్లీ ఒక ప్రకటనలో తెలిపారు. చినరావూరు వాటర్ ట్యాంక్ దగ్గర ఉదయం 11 గంటలకు, రాత్రి 7 గంటలకు సభలు జరుగుతాయని చెప్పారు. సభల్లో కోదాడకు చెందిన బిషప్ ఎదురుమొండి మోజెస్, గుంటూరుకు చెందిన రెవరెండ్ డాక్టర్ ఎల్.క్లారెన్స్ శాస్త్రిలు వాక్య పరిచర్య చేస్తారని చెప్పారు. అందరూ పాల్గొనాలని కోరారు.

### మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

**తెనాలిరూరల్:** నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ మారీసుపేటలోని మద్యం దుకాణాల నుంచి ఓ వ్యక్తి ఆదివారం 13 క్వార్టరు సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా మార్కెట్ యార్డు వద్ద పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

### ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

**తెనాలిరూరల్:** మార్కులు తక్కువ వస్తాయన్న భయంతో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జగ్గడిగుంటపాలెంకు చెందిన కారంశెట్టి మేఘన (17) ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఇటీవల రాస్తున్న పరీక్షల్లో మార్కులు తక్కువ వస్తాయన్న భయంతో ఈ నెల 7వ తేదీన ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. తల్లిదండ్రులు ఆమెను గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. బాలిక తండ్రి శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు ఆదివారం తెలిపారు.

### నేడు వార్షిక బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశం

**నెహ్రూనగర్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్ సమావేశాన్ని సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో నిర్వహించనున్నట్లు మేయర్ కావటి మనోహర్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సభలో నగరపాలక సంస్థ వార్షిక బడ్జెట్‌నను ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు హాజరవుతారని ఆయన తెలిపారు.

### వ్యక్తి ఆత్మహత్య

**గుంటూరు ఈస్ట్:** వ్యక్తి ఆత్మహత్యపై పాత గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆనందపేట 7వ లైన్‌లో నివసించే షేక్ నజీర్ (30) మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నూతనోత్సాహానికి సిద్ధం

- సిద్ధం సభకు విశేషంగా తరలిన పార్టీ శ్రేణులు
- జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్
- స్వయంగా బస్సు నడిపి జోష్ నింపిన ఎమ్మెల్యే



జెండా ఊపి బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి:** బాపట్ల జిల్లా మేదరమెట్ల జాతీయ రహదారి సమీపాన జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగో చివరి సిద్ధం సభకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు విశేషంగా తరలివెళ్లారు. స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సారథ్యంలో పట్టణంలోని వివిధ వార్డుల నుంచి 60 బస్సుల్లో సిద్ధం సభకు బయలుదేరి వెళ్లారు. సిద్ధం టోపీలు, కండువాలు, పార్టీ జెండాలను ధరించి, వైఎస్ జగన్ జిందాబాద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్ధిల్లాలి అంటూ నినాదాలతో ప్రయాణం సాగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో స్థానిక 34వ వార్డు పరిధిలో రైల్వేస్టేషన్ నుంచి మేదరమెట్లకు ప్రత్యేకంగా పది బస్సులను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాలకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయా వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ రైల్వేస్టేషన్ వద్ద జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. అనంతరం ఆయనే స్వయంగా స్టీరింగు తీసుకుని కొంత దూరం బస్సు నడిపి, పార్టీ నేతల్లో జోష్ నింపారు.

పార్టీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు ఉడుముల మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో కీసరి అంజిరెడ్డి, పెరుగు వెంకటేష్ యాదవ్, శ్రీను రెడ్డి, మధిర తేజ, అంబరీష్, పెద్ద సుభాని, మల్లిరెడ్డి పాల్గొన్నారు. ప్రతి వార్డులోనూ అక్కడకు కేటాయించిన బస్సుల్లో అక్కడి పార్టీ నాయకులు/ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలివెళ్లారు. నియోజకవర్గం నుంచి మొత్తం 150 బస్సుల్లో, 50పైగా కార్లలో పార్టీ నేతలు, కార్యకర్తలు మేదరమెట్లకు తరలివెళ్లారు. దాదాపు 6,500 మంది వరకు సిద్ధం సభకు వెళ్లినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

### సిద్ధం సభకు తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు

**తెనాలిటౌన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మేదరమెట్ల వద్ద ఏర్పాటు చేసిన సిద్ధం బహిరంగ సభకు రూరల్ మండల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఆదివారం బస్సుల్లో తరలివెళ్లారు. మండలంలోని 18 గ్రామాలకు 80 బస్సులను కేటాయించారు. ఆయా గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సభకు వెళ్లారు. గ్రామాల్లో పార్టీ నాయకులు జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. కొలకలూరు గ్రామం నుంచి పార్టీ గ్రామ కన్వీనర్ ప్రసాదం సురేష్, యువజన విభాగం గ్రామ అధ్యక్షుడు కోలంటి దాసు, ఎస్సీ సెల్ కన్వీనర్ మల్లవరపు బుల్లయ్య, నాయకులు కె.రమేష్, వీరమల్లు కార్తికేయ, కొలకలూరి నాగేశ్వరరావు, పినపాటి అనిల్, సుద్దపల్లి నవీన్, మల్లవరపు విజయ్, భరత్, షేక్ అజ్గర్, సుద్దపల్లి దానియేలు, జాన్‌పాల్, అమీర్ బాషా, భూషయ్య, నలుకుర్తి జోసఫ్, చిరంజీవి, తదితరులు వెళ్లారు. రూరల్ మండలం కఠెవరం నుంచి గ్రామ మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, పార్టీ కన్వీనర్ తమ్మా శివారెడ్డి, ఆదం షఫీ, బొనిగల సురేష్, శ్రీనివాస రెడ్డి, ఎల్.చినబాబు, ముక్కాల మహేష్, తదితరులు వెళ్లారు. రూరల్ మండలం నందివెలుగు నుంచి గ్రామ సర్పంచ్ దూళిపాళ్ళ పవన్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు షేక్ షిలార్ జానీ, గ్రామ కన్వీనర్ కానుగోలు సురేష్, బొంతు నరేంద్రరెడ్డి, వేముల మహేష్, బెజ్జం బాజి, మంగా చిట్టిబాబు, తదితరులు వెళ్లారు. కంచర్లపాలెం నుంచి కోపల్లె సురేష్, కఠెవరపు శివయ్య, రాజేష్, పాదిలి శ్రీనివాసరావు, హాఫ్‌పేట నుంచి ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి సుందరరావు, సుధాకర్, అబ్రహం, గుడివాడ నుంచి మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, మత్తే ధనకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

### మేదరమెట్లకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**కొల్లిపర:** బాపట్ల జిల్లా అద్దంకి నియోజవర్గంలోని మేదరమెట్ల దగ్గర ఆదివారం ఉదయం 10 గంటలకు సిద్ధం బహిరంగ సభకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలోని 20 గ్రామాల నుంచి 75 బస్సులు, 50 కార్లు ద్వారా సుమారు 3,700 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా తరలివెళ్లారు. మరికొంత మంది తమ సొంత వాహనాల్లో వారి కుటుంబసభ్యులతో సహా సిద్ధం సభకు బయలుదేరారు. సభకు వెళ్లలేని పార్టీ అభిమానులు కొంత మంది ఇళ్ల వద్దే టీవీల్లో కార్యక్రమాన్ని తిలకించారు.



కొలకలూరు నాయకులు



జెండాలు చూపుతున్న కఠెవరం నాయకులు



జెముడుపాడు నుంచి..



తూములూరు గ్రామం నుంచి..

### పట్టాభిరాముని ఆలయంలో విశేష పూజలు



**తెనాలిటౌన్:** పట్టణ బాలాజీరావుపేటలోని పట్టాభిరామస్వామి దేవాలయంలో ఆదివారం బీసీ సంక్షేమ సంఘ పట్టణ అధ్యక్షులు మేడిబోయిన గంగా యాదవ్ కుటుంబ సభ్యులు, స్నేహితులు విశేష పూజలు నిర్వహించారు. అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆలయంలో ఉన్న బాలరామునికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలసి శ్రీరామునికి పూజలు జరిపారు. కార్యక్రమంలో న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, పట్టణ బీసీ యువజన అధ్యక్షులు ఆరాధ్యుల శివయాదవ్, మున్సిపల్ కో-ఆప్షన్ మెంబర్ బచ్చనబోయిన శ్రీనివాసరావు, దారా రామకృష్ణ, చిట్టిబొమ్మ కిషోర్ గౌడ్, ఎం.భీష్మ పాములు, కె.వెంకటేశ్వరరావు, కె.రవి పాల్గొన్నారు.

### మహిళా విద్యకు సావిత్రీబాయి సేవలు ఎనలేనివి



**తెనాలిఅర్బన్:** మహిళా విద్యను ప్రోత్సహించేందుకు సంఘ సంస్కర్త సావిత్రీ బాయి పూలే విశేష కృషి చేశారని ఆంధ్రప్రదేశ్ నవ చైతన్య బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు మేడిబోయిన గంగా యాదవ్ కొనియాడారు. సావిత్రీ బాయి పూలే వర్ధంతిని మార్కెట్ సెంటర్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు తట్టుకుళ్ళ అశోక్ యాదవ్, రఘురామయ్య, పి.యలమంద, ఆర్టీసీ శ్రీను, కరేటి రవి, కందుల సాంబశివరావు, కాళిదాసు వెంకటేశ్వరావు, భీష్మ పాములు, మేకల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రథం ఊరేగింపు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు



రథం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

**తెనాలిటౌన్:** రూరల్ మండలం కొలకలూరులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శాసన మండలి చీఫ్ విప్ డాక్టర ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు కాలిశెట్టి ఫణికుమార్ కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఉమ్మారెడ్డి ప్రారంభించారు. సాయంత్రం పెద్ద రథం ఊరేగింపును గ్రామంలో నిర్వహించారు. రథం ఊరేగింపులో ఉమ్మారెడ్డి పాల్గొని కొద్దిసేపు రథం తాడును లాగారు. శివ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ఊరేగింపులో భక్తులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కాలిశెట్టి లక్ష్మీనాంచారమ్మ, ఆలయ ఈవో నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగుమోతు శివనాగేశ్వరరావు, సుంకర శ్రీనివాసరావు, జంగా శివనాగిరెడ్డి, ఎంపీటీసీ ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

**తాడేపల్లిరూరల్ :** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నిడమర్రులో జిల్లా ప్రజా ఆరోగ్య పరిరక్షణ సమితి, భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేదలకు ఉచితంగా కంటి వైద్యం చేసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. శిబిరంలో 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాంప్రసాద్, విసనం హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కిలారి సునీల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి నాగేశ్వరరావు, జాలాది జాన్‌బాబు, బత్తూరి మోహనరావు, ఎస్‌కె కరీముల్లా, ఆళ్లమూడి హనోక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకం



పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** సమాజాభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమని గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి జేవీ సుధీర్‌కుమార్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్-1 విభాగ ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలో చేపట్టిన వారం రోజుల ప్రత్యేక శిబిరంలో భాగంగా ఆదివారం స్థానిక నగరపాలకసంస్థ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో యువతరం పాత్ర, దేశాభివృద్ధికి ఆవశ్యకతను తెలియజేశారు. గ్రామాలు, వార్డులలో సామాజిక సేవా కార్యక్రమాల్ని నిర్వహించడం ద్వారా విద్యార్థులు ప్రజలతో మమేకం కావడంతో విద్యాపరంగా, సామాజికంగా ముందుకు వెళతారని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్-1 విభాగ కార్యక్రమ నిర్వహణాధికారిణి ఎం. సంతోష్‌కుమారి, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

## ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలి





సమావేశంలో మాట్లాడుతున్న శివరామిరెడ్డి

**లక్ష్మీపురం:** రాబోయే ఎన్నికలకు ముందుగానే రాజకీయ పార్టీలకిచ్చిన ఎన్నికల బాండ్ల వివరాలు ప్రకటించాలని, ఎస్‌బీఐ గడువు అడగడం ప్రజాభిప్రాయాన్ని, సుప్రీం ఆదేశాల్ని బేఖాతర్ చేయటమేనని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సుప్రీం కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో ఎస్‌బీఐ విఫలమైందని తెలిపారు. ఏపీ లీగల్ ఫోరం కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ ఎస్‌బీఐ అధికారులు కేంద్ర ప్రభుత్వ ఒత్తిడికిలోనై జూన్ 30 వరకూ సమాచారం ఇవ్వడానికి సమయం అడిగారన్నారు. ఎన్నికలు ముగిసే వరకు బాండ్ల వివరాలు వెల్లడించకుండా పన్నిన పన్నాగంలో భాగమే ఇదని తెలిపారు. కార్యక్రమంలో ఇంజనీర్ ఎన్.సదాశివం, అధ్యాపకులు కె.జయకుమార్, విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య ప్రసంగించారు.

### మహిళ అదృశ్యం



**గుంటూరు ఈస్ట్:** మహిళ అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. శారదా కాలనీ 24వ లైనుకు చెందిన 28 సంవత్సరాల మేడా మరియమ్మ ఈ నెల 8న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని కుటుంబసభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రామిరెడ్డినగర్‌లో బాలిక...**

**గుంటూరు ఈస్ట్:** బాలిక ఆదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రామిరెడ్డినగర్ 1వ లైన్‌లో నివసించే 14 సంవత్సరాల బాలిక ఈ నెల 6న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 86888 31340కు సమాచారం ఇవ్వాలని కోరారు.

### అలరించిన సంగీత విభావరి



**పాత గుంటూరు:** అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో శివసాయి చారిటబుల్ ట్రస్టు నిర్వహణలో విజయవాడ, గుంటూరు గాయకుల సహకారంతో అభినందన ఫౌండేషన్ అనాథ శరణాలయం సహాయార్థం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. గాయనిలు మునిపల్లె రమణి, నేరెళ్ల చందన, అత్తోట సౌజన్య, బెల్లంకొండ భారతి, జరీన కమల్, విజయలక్ష్మి సినీ పాటల్ని ఆలపించారు. అనంతరం నిర్వాహకులు గాయనిలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ పరిషత్ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, వెహికిల్ ఇన్‌స్పెక్టర్ యన్. శివనాగేశ్వరరావు, బిల్ల అశోక్ పాల్గొన్నారు.

### స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి



డాక్టర్ సుల్తానాను అభినందిస్తున్న ఎమ్మెల్సీ, మహిళ కమిషన్ మాజీ చైర్‌పర్సన్

**గుంటూరు మెడికల్:** సమాజంలో అట్టడుగునున్న బడుగు, బలహీన వర్గాలకు చేయూతనిచ్చేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర మహిళ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. అంర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిలోని క్యాంపు క్యార్యాలయంలో యువనారీస్ హెల్త్ కేర్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకురాలు, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ షమ సుల్తానాను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు కార్పొరేట్ హాస్పిటల్స్ యాజమాన్యాలు ధనార్జనే ధ్యేయంగా ముందుకు సాగుతున్న సమయంలో పేదలకు నామమాత్రపు ఫీజులతో డాక్టర్ షమ సుల్తానా వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. కేవలం రూ. 10లకే ఓపీ ఫీజు, ల్యాబ్ పరీక్షల్లో 50 శాతం రాయితీతో తాము వైద్య సేవలు అందిస్తున్నామని డాక్టర్ షమ సుల్తానా తెలిపారు. కార్యక్రమంలో హోప్‌విన్ హాస్పిటల్స్ మేనేజర్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంత పోలింగ్ నిర్వహణకు సహకరించండి

**సీఐ సీహెచ్ ప్రభాకర్**



పొన్నెకల్లులో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ ప్రభాకర్

**పొన్నెకల్లు(తాడికొండ):** ప్రశాంత పోలింగ్ నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీలు సహకారం అందించాలని తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ కోరారు. ఎన్నికల నేపథ్యంలో తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలోని వీధుల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఓటు హక్కు ప్రతి పౌరుడు వినియోగించుకునేలా చేయడం ద్వారా బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థ నిర్మాణం సాధ్యమన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో రౌడీ షీటర్లు, వివాదాస్పద వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎక్కడైనా వివాదాస్పద సంఘటనలు జరిగినా, జరిగే అవకాశాలు ఉన్నా ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు కేంద్ర బలగాలు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు వ్యథలు, కన్నీటి దర్పణం 'మట్టి బండి'



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుబ్బారావు, నాలేశ్వర శంకరం తదితరులు

**గుంటూరు:** ప్రకృతి అనుకూలించక, నకిలీ విత్తనాలు, పురుగు మందులు, గిట్టుబాటు ధరలు లేక అన్ని రకాలుగా దోపిడీకి గురవుతున్న రైతు వ్యథల కథల కన్నీటి దర్పణం 'మట్టి బండి' పుస్తకమని ప్రముఖ విద్యా, సాహితీవేత్త డాక్టర్ నాలేశ్వరం శంకరం పేర్కొన్నారు. ఆదివారం బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం శ్రీ పద్మావతి కల్యాణ మండపంపై ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మూడో ముద్రణ 'మట్టి బండి' పుస్తకం ఆవిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. సభకు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని గుళ్లపల్లి సుబ్బారావు ఆవిష్కరించారు. అరసం జాతీయ కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, అమరావతి సాహిత్య మిత్రులు కన్వీనర్ పింగళి భాగ్యలక్ష్మి, డాక్టర్ జక్కంపూడి సీతారామారావు సమీక్షించారు. కార్యక్రమంలో చిట్టినేని కోటేశ్వరరావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, ఏనుగు సుబ్రహ్మణ్యం నాయుడు, పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు, రచయితలు, కవులు పాల్గొన్నారు.

## అగ్ర కులాధిపత్య భావజాలాన్ని ఎదిరిద్దాం



సభలో మాట్లాడుతున్న కృష్ణ

**పాత గుంటూరు:** అగ్రకులాధిపత్య, మనువాద, పితృస్వామ్య, భావజాలానికి వ్యతిరేకంగా పోరాడటమే సావిత్రీబాయి పూలేకి ఇచ్చే ఘనమైన నివాళి అని కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కె. కృష్ణ పేర్కొన్నారు. రాష్ట్ర కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో బ్రాడీపేట సీపీఎం కొరటాల సత్యనారాయణ భవనం సమావేశ మందిరంలో ఆధునిక భారతదేశ తొలితరం మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే 127వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రస్థాయి మహిళా చైతన్య సదస్సు నిర్వహించారు. కావలి జయమ్మ అధ్యక్షతన వహించారు. మహిళలు, మనస్మృతి అంశంపై మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు బి. సాంబశివరావు మాట్లాడారు. నిత్యం అన్యాయం, అణిచివేత, దోపిడీ, దౌర్జన్యాలకు గురవుతున్న అంటరాని మహిళల చైతన్యానికి విద్య అవసరం అని గుర్తించి దాన్ని నేర్పిన మహా మనిషి సావిత్రీబాయి పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు సి.ఎస్. ఆర్. ప్రసాద్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి. వెంకటరావు, కోశాధికారి కావలి బాలయ్య, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, సుబ్బారాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగేశ్వరరావు, పీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బి. కొండారెడ్డి, ప్రజా కళామండలి రాష్ట్ర కార్యదర్శి జె.కోటితో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. ప్రజా కళామండలి కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.